సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



ఉత్సాహంగా ఎస్‌పీఎల్ రీజినల్ టోర్నమెంట్

'సాక్షి' ఆధ్వర్యంలో నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన ఎస్‌పీఎల్ రీజినల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఏసీపీ కిరణ్‌కుమార్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు.

- 10లో ▸

◂ జూనియర్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్

న్యూస్‌రీల్

రెండో పంటకు పుష్కలంగా సాగునీరిస్తాం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



వర్ని: నిజాంసాగర్ ప్రాజెక్టు కింద పంట పొలాలకు రబీ పంటకు పుష్కలంగా నీరందిస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మండలంలోని తగిలేపల్లిలో నిర్మించనున్న గజ్జలమ్మ, పెద్దమ్మ మందిరాల నిర్మాణానికి గురువారం స్పీకర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి కొరత లేకుండా రెండో పంటకు సాగునీరు అందిస్తామని, రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రాష్ట్రంలో దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉత్తర తెలంగాణలో చిన్న తిరుపతిగా పిలవబడే తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 26 నుంచి మార్చి మూడో తేదీ వరకు నిర్వహించనున్నామని, బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సీఎం కేసీఆర్ వస్తున్న ట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, తగిలేపల్లి సర్పంచ్ వెంకన్న, ఎంపీటీసీ నారాయణ, రుద్రూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ తొంట శంకర్ పాల్గొన్నారు.

బయోటెక్నాలజీ విభాగంలో అంతర్జాతీయ సదస్సు

డిచ్‌పల్లి: తెలంగాణ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగంలో ఈ నెల 21 నుంచి 23 వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సెమినార్ కో ఆర్డినేటర్ ప్రవీణ్ తెలిపారు. బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఇన్ బయోలాజి అండ్ మెడిసిన్–2023 అనే అంశంపై మూడు రోజుల పాటు సదస్సు ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి హాజరవుతారన్నారు. సదస్సులో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ప్రసంగిస్తారని చెప్పారు.

యోగా తరగతులు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలోని గర్ల్స్ హాస్టల్‌లో గల సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం వీసీ రవీందర్ యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. యోగా శిక్షణ కోసం యోగా గురువు సిద్దిరాములును నియమించారు. విద్యార్థులు యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిజామాబాద్ నుంచి వేములవాడకు బస్సులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి శివరాత్రి ఉత్సవాలకు వేములవాడకు బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎం ఉషాదేవి తెలిపారు. నిజామాబాద్ నుంచి 11, ఆర్మూర్ నుంచి 15, కామారెడ్డి నుంచి 10 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిరికొండ మండలంలోని లొంక రామాలయానికి మూడు రోజుల పాటు 5 బస్సులు అందుబాటులో ఉంటాయని, అలాగే మాచారెడ్డిలోని మద్దికుంటకు 4 బస్సులు రెండు రోజులపాటు నడుస్తాయని తెలిపారు. కొమరవెల్లి మల్లన్నను దర్శించుకోవడానికి కామారెడ్డిలో బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. శివరాత్రికి ఆర్టీసీ రీజినల్ పరిధిలో 45 బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

చారిత్రక సాక్ష్యాలు..

- ఇందూరు చరిత్రను చాటుతున్న మహాదేవుడి ఆలయాలు
- శివరాత్రికి ముస్తాబు
- తరలిరానున్న భక్తజనం

చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపించడంలో చారిత్రక కట్టడాలు కచ్చితమైన ఆనవాళ్లుగా ఉంటున్నాయి. ఇక ప్రాచీన ఆలయాలైతే చారిత్రక నేపథ్యంతో పాటు పురాణ ఇతిహాసాలను సైతం నేటితరం వారికి చాటిచెప్పడంలో తిరుగులేని పాత్రను పోషిస్తుంటాయి. ఇందూరు జిల్లాలో ప్రాచీన చరిత్రను ఇముడ్చుకున్న మహాదేవుడి ఆలయాలు ఎన్నో ఉన్నాయి. ఇవి ఈ ప్రాంత ఘన చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. మహా శివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలో ఈ ఆలయాల చారిత్రక నేపథ్యంపై ప్రత్యేక కథనం.. – సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



ఇందూరు శ్రీ నీలకంఠేశ్వరాలయం

1,400 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఇందూరులోని స్వయంభు శ్రీ నీలకంఠేశ్వర ఆలయం జైన, ఆర్య శిల్పకళా కౌశలం కలగలిసి ఉంది. శాతావాహన రాజు రెండో పులకేశి జైన మతాన్ని స్వీకరించిన అనంతరం ఈ ఆలయాన్ని జైనాలయంగా తీర్చిదిద్దినట్లు ప్రతీతి. తర్వాత కాకతీయ రాజులు శివాలయంగా మార్చారన్నది స్థల పురాణం. రెండో పులకేశి నాటి ఈ ఆలయంలో స్వయంభు శివ లింగం, విష్ణువు నాభి నుంచి ఉద్భవించిన బ్రహ్మ ఉండడంతో నీలకంఠేశ్వరాలయంగా పిలుచుకుంటున్నారు. మూడెకరాల ఆవరణలో ఉన్న ఈ ఆలయంలో ఉత్తర దిక్కులో కోనేరు, ప్రాచీన రథం కలిగిన రథశాల, మహానందీశ్వరుడు ఆకట్టుకునేలా ఉన్నాయి. శిఖర స్థాపన చేసిన అపురూప శిల్పి అదృశ్యమైనట్లు చెబుతారు. ఆ శిల్పి దైవాంశ సంభూతుడని ప్రజల నమ్మకం.



773 ఏళ్ల చరిత్ర కలిగిన నందిగుట్ట శివాలయం

ఇందూరు శివారులోని నాగారం నందిగుట్ట శివాలయం 773 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ గుట్టపై ఉన్న ఆలయం భారీ బండరాళ్ల మధ్య ఉంది. ఇక్కడ భారీ నంది ఉండడంతో నందిగుట్ట అని పేరు వచ్చింది. ఆలయాన్ని అప్పట్లో గణేశ్ పురి మహరాజ సిద్ధాంతి నిర్మించినట్లు చెబుతారు.


త్రేతాయుగం నాటి 'లొంక' రామలింగేశ్వరాలయం



త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు సీతమ్మ జాడ కోసం లంకకు వెళ్తూ ఒకరోజు రాత్రి లొంకలో విడిది చేసినట్లు పురాణాలు చెబుతున్నా యి. ఉదయం లేచిన తర్వాత ఇక్కడి పుష్కరిణి లో స్నానమాచరించి కొలను నీటిలోని ఇసుకతో శ్రీరాముడు శివలింగాన్ని తయారుచేసి పూజించినట్లు చెబుతారు. రాముడు స్వయంగా ఇసుకతో చేసిన లింగం కావడంతో ఈ ఆలయం రామలింగేశ్వర స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. సిరికొండ మండల కేంద్రం నుంచి 8 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో ఈ ఆలయం ఉంది.



స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయం



ఇందూరు నడిబొడ్డున ఉన్న ఈ శివాలయం త్రేతాయుగంలో స్వయంభుగా వెలిసినట్లు పురాణంలో చెప్పబడిందని పూర్వీకులు చె ప్పారు. ఈ ఆలయాన్ని శంభుని గుడిగా పిలుచుకుంటారు. కాలక్రమంలో శాతవాహనులు, జైనులు, కాకతీయులు వారి పాలనలో వారి చిహ్నాలతో గర్భాలయ ముఖద్వారం, మండపం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

ఆర్మూర్ నవనాథ సిద్ధుల గుట్ట ఆలయం



ఆర్మూర్ పట్టణంలోని నవనాథుల సిద్దుల గుట్ట శివాలయం వేల ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. అప్పట్లో గోరఖ్‌నాథ్, జలేందర్‌నాథ్, చరఫట్‌నాథ్, అపబంగనాథ్, కానీఫానాథ్, మచ్చీంద్రనాథ్, చౌరంగీనాథ్, రేవానాథ్, బర్తరినాథ్ అనే 9 మంది సిద్దులు ఈ ప్రాంతంలో ధ్యానం చేసుకునేవారు. గుట్టపై ఉన్న స్వయంభు లింగం వద్ద ప్రతిరోజూ పూజలు చేసేవారు. ఇందులో ఆరుగురు ఇక్కడి నుంచి వెళ్లిపోగా ముగ్గురు మిగిలారు. దీంతో నవనాథపురం నుంచి ఆర్మూర్‌గా పేరు స్థిరపడింది.



ఉమ్మెడ ఉమామహేశ్వరాలయం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని ఉమ్మెడ శివారులో గల గోదావరి పరివాహ ప్రాంతంలోని ఉమామహేశ్వర ఆలయం ఎంతో చారిత్రాత్మకమైనది. శ్రీరాముడు వనవాసం కాలంలో గోదావరి పరివాహక ప్రాంతంలో కాలిబాటన వెళ్తుండగా ఈ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశాడని పూర్వీకుల చెబుతున్నారు. త్రేతా యుగంలో ఏర్పాటైన ఈ శివలింగానికి 400 ఏళ్ల క్రితం కాకతీయుల కాలంలో ఆలయం నిర్మించారు. ప్రతియేటా వర్షాకాలంలో ఈ ఆలయం నీటిలో మునిగిపోయి శివరాత్రి సమయంలో నీటి నుంచి బయటపడుతుంది.

బాల్కొండ 'లింగమయ్య'

బాల్కొండ మండల కేంద్రంలోని లింగమయ్య ఆలయంలో 200 ఏళ్ల క్రితం శివలింగం వెలిసినట్లు చెబుతారు. నిర్మల్ జిల్లా బురుగుపల్లి నుంచి శివుడు వేములవాడ వెళ్తుండగా మార్గమధ్యలో బాల్కొండలో సేదతీరి ఇక్కడ వెలిసినట్లు చెబుతున్నారు.



ఉప్లూర్ బాలరాజేశ్వరస్వామి

రాష్ట్రంలో వేములవాడ రాజన్న పుణ్యక్షేత్రం తరువాత రెండో పుణ్యక్షేత్రంగా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లోని శ్రీ బాలరాజేశ్వరస్వామి దేవాలయం ప్రసిద్ధికెక్కింది. స్వయంభు శివలింగం ఉన్న ఈ ఆలయం కాకతీయుల కాలంలో 12 శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.





బోధన్ ఏకచక్రేశ్వరాలయం

బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర ఆలయం ప్రాచీన, చారిత్రక ప్రాశస్త్యం కలిగి ఉంది. అత్యంత ప్రాచీన శివ లీలామృత సంస్కృత గ్రంథంలో ఈ చక్రేశ్వరాలయ ప్రసక్తి ఉంది.

శాండిల్య మహర్షి శిష్యులతో ఈ దేవాలయంలో వేద ఘోష జరిపేవారని శివలీలామృతంలో రాశారు. కాకతీయుల కాలంలో ముష్కరుల దక్షిణ దేశ దండయాత్ర సమయంలో ఈ ఆలయాన్ని కాపాడుకునేందుకు భూస్థాపితం చేశారని తెలుస్తోంది. తరువాత ఈ ఆలయం పుష్య బహుళ అమావాస్య రోజున బయటపడింది. కాగా గుంటూరుకు చెందిన రామిరెడ్డి బోధన్‌లో స్థిరపడేందుకు ఇక్కడి మట్టికోటను చదును చేస్తుండగా 1959 ఫిబ్రవరి 7న ఆలయం వెలుగుచూసింది. కాగా ఈ ఆలయం పేరుమీదే బోధన్ పట్టణానికి గతంలో ఏకచక్రపురం అనే పేరు ఉండేది.

డీజిల్‌నూ తాగేశారు

- వాహనాలు తిరగకున్నా ఖర్చుల్లో లెక్కలు
- కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలో అక్రమాలు
- ఏడాదిన్నరగా సాగుతున్న తంతు
- ప్రత్యేక తనిఖీల్లో గుర్తించిన అధికారులు
- కమిషనర్‌కు నివేదిక

నిజామాబాద్ నాగారం: నగర కార్పొరేషన్‌లోని శానిటేషన్ విభాగంలో వాహనాలను వాడకున్నా డీజిల్ ఖర్చులు చూపించినట్లు ఇటీవల అధికారులు తనిఖీల్లో గుర్తించారు.నగరంలో 6 జోన్ కార్యాలయాలు నాందేవాడ 1, గోల్‌హనుమాన్ 2, పెద్దబజార్ 3 , రాజీవ్‌గాంధీ ఆడిటోరియం 4 ఏ, కంఠేశ్వర్ 4బీ , అర్సపల్లి 5 ఉన్నాయి. ఒక్కో జోన్‌లో 15 మినీ టాటా ఏసీ వాహనాలు, రెండేసి చొప్పున ట్రాక్టర్లు, స్వీపింగ్ మిషన్లు, ఐచర్లు ఉన్నాయి. ఒక్కో జోన్‌లో 200 మంది చొప్పున కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో వాహనానికి ప్రతినిత్యం డీజిల్ 12 లీటర్లపైనే ఖర్చవుతుందని శానిటేషన్ అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే డీజిల్ ఖర్చుకు తగ్గట్లు వాహనాలు తిర గడం లేదని, ఆ మేరకు చెత్త సేకరణ జరగడం లేదని తనిఖీ చేసిన అధికారులు నివేదికల్లో వెల్లడించారు. ఓ ఇన్‌చార్జి అధికారికి ముడుపులివ్వడంతో డీజిల్ ఖర్చులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు సైతం ఉన్నాయి. కొన్ని నెలలుగా రాత్రుల్లో వాహనాలు తిప్పకుండా మూలకు పడేశారు.అయితే రాత్రుల్లో తిరిగినట్లు పేర్కొంటూ డీజిల్ ఖర్చులు చూపించారు. అలాగే పబ్లిక్ టాయ్‌లెట్స్ బస్సులు ఉపయోగించకున్నా డీజిల్ ఖర్చులు చూపించారు. ఏడాదిన్నరగా ఈ తంతు జరుగుతోంది. ప్రత్యేకాధికారులు ఇటీవల ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆయా జోన్‌లలో జరుగుతున్న అక్రమాలపై ప్రాథమిక నివేదికను కమిషనర్ చిత్రమిశ్రాకు అందజేశారు. దీంతో ఆమె వారం రోజుల క్రితం డీజిల్ ఖర్చు ఒక్కో వాహనానికి 6 నుంచి 9 లీటర్లలోపు ఉపయోగించాలని ఎంహెచ్‌వోకు ఆదేశాలు ఇచ్చారు.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు మెమోలు

నిజామాబాద్ నాగారం: నగరంలోని శానిటేషన్ విభాగంలో డీజిల్ అక్రమాలకు సంబంధించిన ఆరుగురు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా గురువారం రాత్రి మెమోలు జారీ చేశారు. ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, మహిపాల్, శ్రీకాంత్, సునీల్, ప్రభుదాస్, నటరాజ్ గౌడ్ తదితరులకు మెమోలు జారీ అయ్యాయి. రూ. 10 లక్షల వరకు డీజిల్ అధిక మొత్తంలో ఎందుకు వినియోగించారని, దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని వివరణ కోరారు.

మళ్లీ కత్తిపోట్ల కలకలం!

- నెల రోజుల్లోనే మరో ఘటన
- కొడుకును చంపారన్న ప్రతికారమే కారణమా?

ఖలీల్‌వాడి: నగరంలో మరోసారి కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. ఇబ్రహీం చావూస్ హత్య జరిగి నెల రోజులు తిరగక ముందే మరో హత్యాయత్నం జరగడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. నగరంలో ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు పెరిగిపోతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై పోలీసుల నిఘా లేకపోవడం ఇందుకు కారణమనే చర్చ జరుగుతోంది. నగరంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేసే స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, ఇంటెలిజెన్స్‌తో పాటు పోలీసులు ఉన్నప్పటికీ నేరస్తులపై ఫోకస్ చేయలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నగరంలోని మూడోటౌన్ పరిధిలో గల హమాల్‌వాడిలో గురువారం మానే శివకుమార్ అనే వ్యక్తిని బైక్‌పై వచ్చిన అగంతకులు కత్తితో పొడిచి పరారయ్యారు. దీంతో స్థానికులు అతడిని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే గత జనవరి 1న బోధన్ శివారులోని నర్సాపూర్ ప్రాంతంలో రౌడీషీటర్ చాట్ల శివ హత్య జరిగింది. హత్య కేసులో మానే శివకుమార్ నిందితుడిగా ఉన్నాడు. ఇతను వారం రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైనట్లు తెలిసింది. కొడుకును చంపిన మానే శివకుమార్‌పై శివ తండ్రి చాట్ల గోపి కక్ష పెంచుకున్నట్లు తెలుస్తోంది. హమాల్‌వాడిలో శివకుమార్ ఉండగా ఇద్దరు వ్యక్తులు హెల్మెట్ పెట్టుకుని బైక్‌పై వచ్చి కత్తులతో దాడి చేశారు. శివకుమార్ కేకలు వేయగా ఇద్దరు బైక్‌పై పరారైనట్లు స్థానికుల ద్వారా తెలిసింది. చాట్ల గోపితో పాటు మరో వ్యక్తి కత్తితో పొడిచి దాడికి పాల్పడినట్లు బాధితుడు తెలిపాడు. ఘటనా స్థలాన్ని మూడో టౌన్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బృందాలతో గాలింపు

శివకుమార్‌పై కత్తులతో దాడి చేసిన నిందితులు పరారీలో ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు టౌన్ సీఐ వెంకట నారాయణ, ఎస్సై సందీప్‌ల బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు.

'దళారులు ధర తగ్గిస్తున్నా పట్టించుకోరా?'

నిజామాబాద్ సిటీ: పసుపు, ఎర్ర జొన్న కొనుగోలు విషయంలో దళారులు ధర తగ్గించేస్తున్నా ప్రభుత్వ నియంత్రణ సరిగ్గా లేదని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఎర్ర జొన్న దళారులు ఏకమవడంతో మార్కెట్‌లో ధర తగ్గిందని, మంత్రి, ఎమ్మెల్యేలు దళారులను నియంత్రించడంలేదని, వారితో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. వారం రోజుల క్రితం రైతులు పసుపు పంటను మార్కెట్‌కు తీసుకువస్తే పంటకు తూకం వేయకపోవడంతో రైతులు మార్కెట్ గేట్లకు తాళం వేసి ప్రభుత్వంపై, అధికారులపై ఒత్తిడి తేవడంతో మార్కెట్‌లో కొనుగోలు మొదలయ్యాయన్నారు. ఎర్ర జొన్న విషయంలో దళారులందరూ ఏకమవడంతో రూ. 4 వేలు ఉన్న ధర రూ. 3500లకు పడిపోయిందన్నారు. అలాగే గతేడాది పసుపు పంటకు రూ. 8వేలు ధర రాగానే ఎంపీ అర్వింద్ ఇది బీజేపీ ప్రభుత్వం ఘనత అని చెప్పుకున్నారని.. ఇప్పుడు ధర తగ్గితే ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. రైతాంగం పక్షాన పోరాటం చేయడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని, రైతులు పంటను తక్కువ రేటుకు అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

ఎమర్జెన్సీ వార్డును ఆధునికీకరిస్తాం

- డీఎంఈ రమేశ్‌రెడ్డి
- జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీ



ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న వైద్య విద్య సంచాలకులు రమేశ్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఎమర్జెన్సీ వార్డును(ట్రయాజీ) అధునాతంగా మార్చనున్నట్లు రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు రమేశ్‌రెడ్డి తెలిపారు. ప్రాణాప్రాయస్థితిలో ఆస్పత్రికి వచ్చేవారికి ఎమర్జెన్సీలోనే మంచి వైద్యం అందాలనే లక్ష్యంతో ఆస్పత్రి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో పెద్ద ఎమర్జెన్సీ వార్డును ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. గురువారం జీజీహెచ్‌లోని పలు వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల్లో కొనసాగుతున్న కార్యక్రమాలు, ఇచ్చిన పరికరాలు సద్వినియోగం చేస్తున్నారా.. ఇంకా సమకూర్చాల్సిన ఉన్నాయా అని అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిలో సిటీ స్కానింగ్ మిషన్ 30నుంచి 45 రోజుల్లో రానుందన్నారు. క్యాట్ లాక్ సేవలందించేందుకు ఏ ర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఎంఆర్‌ఐ మిషన్ త్వరలోనే తెప్పించనున్నట్లు పేర్కొన్నారు. జీజీహెచ్‌లో ప్రస్తుతం ఉన్న ప్రసూతి వార్డు సరిపోవడంలేదని, ఆస్పత్రి ఎదుట మెటర్నిటీ భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. కానీ అది సరిపోదని, మరో రెండు అంతస్తులు నిర్మించాకే జీజీహెచ్‌లోని మెటర్నిటీ వార్డును పూర్తిగా తరలిస్తామన్నారు.

ప్రసవాలపై ఆరా..

నిజామాబాద్ జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన వైద్యా విద్య సంచాలకుడు రమేశ్‌రెడ్డి ప్రసూతి వార్డును తనిఖీ చేశారు. ప్రసూతి కేసుల వివరాలు తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ప్రసూతి కేసులు ఎక్కువగా ఉన్నాయని.. కారణం ఏమిటని అక్కడ ఉన్న ఆశ కార్యకర్తలను పిలిచి మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించగా బోధన్ నుంచి వచ్చినట్లు తెలిపింది. దీంతో ఆయన స్పందిస్తూ ఏరియా ఆస్పత్రుల సమీపంలోనే ఉన్న ఇక్కడకు ఎందుకని కాన్పులకు తీసుకువస్తున్నారని ప్రశ్నించారు. ఏరియా ఆస్పత్రులకు వెళ్లకుండా అక్కడి వైద్యులు కేసులను రిఫర్ చేయకున్నా మీఅంతట మీరే గర్భిణులను ఎలా తీసుకువస్తారని ప్రశ్నించారు. ఏరియా ఆస్పత్రుల్లో సౌకర్యాలున్నా జీజీహెచ్‌కు కేసులు తీసుకురావడం సరైంది కాదన్నారు. ఇటువంటి కేసులపై దృష్టి సారించాలని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌కు సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిర, ఏడీ సంతోష్, వైద్యులు ఉన్నారు.

కొనసాగుతున్న పోలీసుల క్రీడలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పో లీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ హెడ్ క్వార్టర్ గ్రౌండ్‌లో క్రీడలు కొనసాగుతున్నాయి. గురువా రం రెండో రోజూ వాలీబాల్, కబడ్డీతో పాటు క్రికెట్ పోటీలు నిర్వహించారు.

తల్లిదండ్రుల విగ్రహాలు ఏర్పాటు



నందిపేట్: నందిపేటలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమ ప్రాంగణంలో గురువారం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ తన తల్లిదండ్రుల విగ్రహాలను ఆవిష్కరించారు. మంగిరాములు మహారాజ్ తల్లిదండ్రులైన మంగి లక్ష్మమ్మ, సాయిలు మెదక్ జిల్లా దుబ్బాక మండలం పోతిరెడ్డిపేట్ గ్రామం నుంచి 40 ఏళ్ల క్రితం నందిపేట గ్రామానికి బతుకు దెరువు కోసం వలస వచ్చారు. తన తల్లిదండ్రుల విగ్రహాలను రాజస్థాన్ నుంచి తెప్పించి ఆశ్రమ ముఖద్వారం ముందు ప్రత్యేక మందిరాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాశీ నుంచి వచ్చిన సాధువులతో పాటు ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘డబుల్’ లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- పోడు భూములకు పాస్‌బుక్కులు అందించేందుకు చర్యలు చేపట్టాలి
- వీసీలో కలెక్టర్లతో సీఎస్ సమీక్ష

సుభాష్‌నగర్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో వివిధ అంశాలపై సీఎస్ సమీక్షించారు. డబుల్ బెడ్ రూమ్ పథకంతోపాటు కంటి వెలుగు, పోడు భూములు, జీ.ఓ నెం 58, 59, 118 అమలు, తెలంగాణకు హరితహారం తదితర అంశాల ప్రగతిని సమీక్షిస్తూ కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 42,413 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, ఆ మేరకు లబ్ధిదారుల వివరాలు పొందుపర్చలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేలను సంప్రదించి నిబంధనలకు అనుగుణంగా తక్షణమే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని సూచించారు. పూర్తి వివరాలు ఈనెల 26లోపు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈవిషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ, జిల్లాలో 1,176 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని సీఎస్ దృష్టికి తెచ్చారు. ఇప్పటికే 648 మంది లబ్ధిదారులను గుర్తించామని, సోమవారం నాటికి వారి వివరాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయిస్తామని తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను విజయవంతంగా చేపడుతుండటంపై సీఎస్ కలెక్టర్లను అభినందించారు. పోడు భూములకు సంబంధించి వచ్చిన క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొక్కల సంరక్షణ, క్రమం తప్పకుండా నీటిని అందించడంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. కంటి వెలుగు శిబిరాల నిర్వహణకు సంబంధించిన వివరాలతో ప్రతిరోజు తనకు నివేదిక పంపాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. పోడు భూములకు సంబంధించిన క్లెయిమ్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ రోజువారీగా జిల్లాస్థాయి కమిటీ ఆమోదానికి పంపించాలని ఆర్‌డీఓలకు సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీఎఫ్‌ఓ వికాస్ మీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎఫ్‌ఓ

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

రెంజల్: మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన పల్ల చిన్న సాయిలు(35) చికిత్స పొందుతూ నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం మృతి చెందినట్లు ఎస్సై సాయన్న చెప్పారు. ఈ నెల 14న అనారోగ్య కారణాలతో సాయిలు గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు.

నడ్కుడకు చెందిన వృద్ధుడు..

నందిపేట్: మండలంలోని నడ్కుడ గ్రామానికి చెందిన కుమ్మరి మదర్ (63) చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కుమ్మరి మదర్ బుధవారం వ్యక్తిగత పని నిమిత్తం నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామానికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా నికాల్‌పూర్ సమీపంలో అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నమ్మించి మోసం చేశారు

- వ్యవసాయ భూమిని కబ్జా చేశారు
- మాణిక్‌భండార్‌లో రైతు ఆవేదన
- వ్యవసాయ భూమిలోనే డేరా వేసుకుని నిరసన

మాక్లూర్: నమ్మించి మోసం చేసి తన వ్యవసాయ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేసుకున్నాడని ఆరోపిస్తూ గురువారం మండలంలోని మాణిక్‌భండార్‌కు చెందిన సుంకరి లక్ష్మణ్ తన వ్యవసాయ భూమిలోనే డేరా వేసుకుని నిరసన తెలుపుతున్నాడు. అధికారులు కల్పించుకొని న్యాయం చేయకపోతే ఇక్కడే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటామని పేర్కొన్నారు. మాణిక్‌భండార్ శివారులోని 554 సర్వేనంబర్‌లో గల 28 గుంటల భూమి నుంచి తన అవసరార్థం 11 గుంటల భూమిని సుంకరి లక్ష్మణ్ విక్రయించుకున్నాడు. మిగిలిన 17 గుంటల భూమిని కూడా అప్పట్లో అక్కడ వెంచర్ ప్రారంభించిన కామారెడ్డికి చెందిన ఓ రియల్టర్ తనకు విక్రయించాలంటూ లక్ష్మణ్‌పై ఒత్తిడి తెచ్చి గుత్తగా రూ. 18 లక్షలకు ఒప్పందం చేసుకొని లక్ష రూపాయలు బయాన ఇచ్చి ఆ 17 గుంటల భూమిని వెంచర్‌లో కలిపివేశాడు. మిగతా రూ. 17లక్షలు లక్ష్మణ్‌కు ఇవ్వకుండానే ఇతరులకు విక్రయించుకుని వెళ్లిపోయాడు. ఈ భూమి తనదని ఇంకా రావాల్సిన రూ. 17 లక్షలు రాలేదని బాధితుడు ఇప్పుడున్న వెంచర్ యజమాని వద్దకు వెళ్తే.. ఈ విషయం తమకు తెలియదని, ఈ భూమి ప్రస్తుతం తమదంటూ బెదిరిస్తున్నారని బాధితుడు వాపోతున్నాడు. ప్రస్తుతం ఇక్కడ ఎకరం భూమి ధర రూ. 2 కోట్లు పలుకుందని అలా కాకుండా తనతో కుదుర్చుకున్న ధర మేరకు తనకు రావాల్సిన రూ. 17 లక్షలు ఇవ్వాలని కోరుతున్నాడు. లేని తరుణంలో కుటుంబంతో పాటు తన భూమిలోనే ఆత్మహత్య చేసుకుంటానని ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు కల్పించుకొని న్యాయం చేయాలని కోరుతున్నాడు.



వ్యవసాయ భూమిలోనే నిరసన తెలుపుతున్న బాధితుడు

సైన్స్ భవనం పరిశీలన



సైన్స్ భవనాన్ని పరిశీలిస్తున్న వీసీ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నిర్మాణంలో ఉన్న సైన్స్ భవనాన్ని వీసీ రవీందర్ గురువారం సందర్శించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దేవదాస్, కాంట్రాక్టర్ రాజన్నకు పలు సూచనలు చేశారు. భవనం పనులు రెండు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. భవనంతో పాటు పరిసరాలను అందంగా తీర్చిదిద్దాలని, కంప్యూటర్ సైన్స్ బిల్డింగ్ నుంచి నూతన భవనం వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభించాలని ఏఈ వినోద్‌ను ఆదేశించారు.

ఆర్ట్స్ కళాశాల తనిఖీ

యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలను వీసీ తనిఖీ చేశారు. విద్యార్థులు తరగతులకు రెగ్యులర్‌గా హాజరు కావాలన్నారు. త్వరలో జరిగే సెమిస్టర్ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఆర్ట్స్ కళాశాల పార్కింగ్ స్థలం సరిపోవడం లేదని విస్తరించాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి కోరారు. రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ఈసీ మెంబర్, అధ్యాపకులు నాగరాజు, ప్రవీణ్ మామిడాల, ప్రొఫెసర్ కనకయ్య, డాక్టర్ పున్నయ్య, డైరెక్టర్ పీఆర్‌వో ఎండీ జమీల్‌అహ్మద్, ఏపీఆర్‌ఓ శ్రీనివాస్ ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



అంజయ్య(ఫైల్)

నాగిరెడ్డిపేట: అనారోగ్య కారణాలతో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మండలంలోని రాఘవపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఏనుగుల అంజయ్య(59)కు కొంతకాలం క్రితం పక్షవాతం వచ్చింది. కుటుంబ సభ్యులు ఆయనకు చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో పక్షవాతం గురించి ఆయన తరుచూ మదన పడేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం వేకువజామున అంజయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకని వెళ్లి తాడుతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రామవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

కామారెడ్డిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని..

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉండే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని గురువారం ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో నివాసం ఉండే తాటిపాముల స్వప్న, కిరణ్ కుమార్‌గౌడ్‌కు కుమారుడు, కుమార్తె అభిజ్ఞ(23) ఉన్నారు. అభిజ్ఞ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తుంది. ప్రస్తుతం ఆమె వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు. గురువారం ఉదయాన్నే తల్లిదండ్రులు ఇద్దరు డ్యూటీలకు వెళ్లారు. నాలుగు గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి తలుపులు మూసి ఉన్నాయి. ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో కిటికీలోంచి గమనించారు. అప్పటికే అభిజ్ఞ హాలులోని కొక్యానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. తమ కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేవనీ, అభిజ్ఞ ఆత్మహత్య ఎందుకు చేసుకుందో తెలియడం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

అనారోగ్యం, భార్యపై బెంగతో భర్త..

చనిపోయిన భార్యపై బెంగ, అనారోగ్య కారణాలతో ఒకరు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన కామారెడ్డి మండలం ఉగ్రవాయిలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోలకేని బుచ్చయ్య(58) భార్య రెండు నెలల క్రితం చనిపోయింది. ఏడాది క్రితం బుచ్చయ్యకు గుండె ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ఆరోగ్యం సరిగా ఉండడం లేదు. దీంతో కొద్ది రోజులుగా మనస్తాపానికి గురవుతున్నాడు. గురువారం మధ్యాహ్నం తాను నివాసం ఉండే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

తాటిచెట్లు తొలగించడంపై ఆందోళన

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో ఉన్న తాటి చెట్లను రియల్ వ్యాపారస్తులు తొలగించడంపై గురువారం గౌడ కులస్తులు ఆందోళన చేపట్టారు. వేల్పూర్ మాజీ ఎంపీపీ కొటార్మూర్‌లో వెంచర్ ఏర్పాటు చేశారు. వెంచర్‌లో అడ్డుగా ఉన్న ఐదు తాటి చెట్లను రెండు రోజుల క్రితం నరికించి మొదళ్లను ఆనవాళ్లు కనపడకుండా గోతి తీసి పూడ్చేశారు. వృత్తిలో భాగంగా గీత కార్మికులు గురువారం ఉదయం వెళ్లేసరికి చెట్లు కనపడక పోవడంతో ఆందోళన చెందారు. పూడ్చిన ఆనవాళ్లు కనపడడంతో జేసీబీ సహాయంతో తాటి చెట్ల మొదళ్లను వెలికి తీశారు. గీత కార్మికుల పొట్టకొట్టిన మాజీ ఎంపీపీపై అధికారుల చర్యలు తీసుకోవాలని ఘటన స్థలంలో ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మెరుగు మహేందర్ గౌడ్, నాగుల శ్రీధర్ గౌడ్, గంగాధర్ గౌడ్, చిన్న నర్సాగౌడ్, షేర్ల రామాగౌడ్, రాజేశ్వర్ గౌడ్, జనార్దన్‌గౌడ్, నరేష్‌గౌడ్, సాగర్, కిశోర్‌గౌడ్, స్వామిగౌడ్ ఉన్నారు.



ఫిర్యాదు చేస్తున్న గౌడ కులస్తులు

వివాదాస్పద భూముల పరిశీలన

ఇందల్వాయి: గుట్టలు మాయం అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అటవీ శాఖ అధికారులు స్పందించారు. గన్నారం శివారులోని 1223 సర్వే నంబరులోని వివాదాస్పదంగా సాగుకు సిద్ధం చేస్తున్న భూములను ఎఫ్‌డీవో రాంకిషన్ గురువారం పరిశీలించారు. ఇంతవరకు ఆ భూమి అటవీ శాఖ పరిధిలోకి రాలేదని, సమస్య పరిష్కారం అయ్యే వరకు రైతులెవరూ ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దన్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. రైతులు తమవద్ద ఉన్న పట్టా పాస్‌పుస్తకాలు, ఇతర ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో సుమారు 20 మంది రైతులు అటవీ, రెవెన్యూ శాఖల కార్యాలయాల ఎదుట పట్టా పుస్తకాలతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రోజా, ఎఫ్ఆర్‌వో హిమచందనతో ఎఫ్‌డీవో చర్చించారు. 1223 సర్వే నంబరుకి సంబంధించి పూర్తి రికార్డులు సిద్ధం చేయాలన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

మద్యం తాగించి హత్యాచారం

- మహిళ హత్య కేసు ఛేదించిన పోలీసులు

మాచారెడ్డి: మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా శివారులో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మద్యం తాగించి ఇద్దరు నిందితులు ఆమెను అత్యాచారం చేసి, హత్య చేసినట్లు కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు.. ఈ నెల 3న మండలంలోని గజ్యానాయక్ తండా శివారులో అనుమానాస్పదంగా మృతి చెందిన ఓ మహిళా మృతదేహం లభ్యమైంది. మాచారెడ్డి ఎస్సై ఆధ్వర్యంలో జరిపిన విచారణలో ఆ మహిళ రాజన్న సిరిసిల్ల జిల్లా గౌరింటాలకు చెందిన వీఆర్‌ఏ గాదం వెంకటవ్వ(48)గా గుర్తించారు. స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంగా జనవరి 28న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన అలకుంట్ల సాయిలు, మంద దేవయ్యతో వెంకటవ్వ గజ్యానాయక్ తండా సమీపంలోని దర్గా వద్ద మద్యం తాగినట్లు సీఐ వివరించారు. మద్యం మత్తులో ఆ ఇద్దరు వెంకటవ్వను అత్యాచారం చేసి, హత్య చేసినట్లుగా విచారణలో తేలినట్లు సీఐ వెల్లడించారు. వారిద్దరి మీద ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

పోచారం ప్రాజెక్టులో యువకుడి గల్లంతు

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం ప్రాజెక్టులో గురువారం పోచారం గ్రామానికి చెందిన పుప్పాల బాబు(32) గల్లంతయ్యాడు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలోకి నీటిని విడుదల చేసే గేట్ల వద్ద బాబు గల్లంతయినట్లు గ్రామస్తులు చెప్పారు. నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి తహసీల్దార్ రాందాస్, ఎస్సై ఆంజనేయులు ప్రాజెక్టు వద్దకు చేరుకొని గ్రామానికి చెందిన జాలర్ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రాజెక్టులో వ్యక్తి గల్లంతయ్యాడనే విషయం తెలిసి అధిక సంఖ్యలో ప్రజలు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. గురువారం చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు.

భర్తను చంపిన భార్యకు ఐదేళ్ల జైలు

ఖలీల్‌వాడి: భర్త మృతికి కారణమైన భార్యకు ఐదు సంవత్సరాల కఠిన కారగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ తెలిపిన వివరాలు.. సిరికొండ మండలం రావుట్ల గ్రామానికి చెందిన నాయిడి గంగారాంకు ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన సాయమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె మమతకు డిచ్‌పల్లి మండలం యానాంపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌తో పెళ్లి జరిగింది. బతుకు దెరువు కోసం గంగారాం గల్ఫ్‌కు వెళ్లి వచ్చారు. గల్ఫ్ నుంచి వచ్చిన గంగారాం ఎలాంటి పని లేకుండా తిరిగేవాడు. దీంతోపాటు భార్యపై అనుమానం పెంచుకొని వేధించేవాడు. భర్త బాధలు తట్టుకోలేని సాయమ్మ, తన కూతురు మమత సాయంతో 2019 జులై 8న హత్య చేసింది. నేరం రుజువు కావడంతో సాయమ్మకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించారు. మమతపై నేరం రుజువు కానందున నిర్దోషిగా విడుదల చేశారు.

బైక్, కారు ఢీ

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ శివారులో బైక్ కారు ఢీకొన్న ఘటనలో నిజామాబాద్‌కు చెందిన జల్ద శ్రీనివాస్‌కు తీవ్ర గాయలయ్యాయి. బుధవారం రాత్రి శ్రీనివాస్ వెల్మల్‌లో పనులు ముగించుకొని ఆలూర్‌కు వస్తున్న సమయంలో ఆలూర్ నుంచి వెల్మల్ వెళ్తున్న కారు ఢీకొంది. క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

బాల్య వివాహం నిలిపివేత

మోపాల్: మండలంలోని మంచిప్పలో బాల్య వివాహాన్ని జిల్లా బాలల పరిరక్షణ కమిటీ, సీడీపీవో అధికారులు గురువారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన అబ్బాయికి గాంధారి మండలానికి చెందిన అమ్మాయితో వివాహం నిశ్చయమైంది. గురువారం పెళ్లి ఉండగా పెళ్లి కుమారుడికి 21 ఏళ్లు నిండకపోవడంతో విషయం తెలుసుకున్న అధికారులు అడ్డుకున్నారు. అనంతరం పెద్దల సమక్షంలో గ్రామపంచాయతీలో కౌన్సెలింగ్ నిర్వహించారు.